


# ఇంద్రనీలం

## హితశ్రీ

(1962 యువ మాసపత్రిక, దీపావళి సంచిక నుంచి)




శ్యామ సుందర్ స్టేషన్ కి వచ్చి వేచివున్నాడని ఉరుకులు పరుగులతో పొగలు కక్కుతూ టైముకి రావలసిన అవసరం ట్రెయిన్ కేమీ లేదుట. అలా అని స్టేషన్ మాస్టర్ చెప్పాడు. పోనీ, ఆ ధూమశకట రాజం ఆచోకీ ఏమైనా తెలిస్తే చెప్పమని శ్యామసుందర్ మర్యాదగా అడిగాడు. అందుమీదట స్టేషన్ మాస్టర్ ఒక చిన్ననవ్వు నవ్వి. ఒకసారి దగ్గి, అతని నల్లటి పెదవులవంక చూసి కుర్చీలో కూర్చుని తాపీగా సిగరెట్ పొగ విడుస్తూ, ప్రపంచాన్ని గురించి తీరిగ్గా ఆలోచించే ఈ కాలపు యువకుడిలా "ట్రెయిన్ పావుగంట నించీ, చినగంజాంలో బైఠాయించి ఉంది" అన్నాడు. శ్యామసుందర్ నవ్వి అక్కడి నించి బయల్దేరాడు. స్టేషన్ మాస్టర్ మామగారికి స్నేహితుడు. అంతకిముందు ఆ ఊరు వచ్చినప్పుడు పరిచయం చేశాడు. హాస్యప్రియుడు. ఇంతకీ రైలు రావటానికి చాలా వ్యవధి ఉంది. ఏం చేయటానికీ శ్యామ సుందర్ కి తోచలేదు.

ప్లాట్ ఫారం మీద నడుస్తుంటే సిగరెట్ వగైరాలమ్మే దుకాణం కనిపించింది. స్టేషన్ మాస్టర్ సిగరెట్ ప్రస్తావన తెచ్చి రెచ్చగొట్టాడు. బహుశా మామగారు ఆయనకి తన మంచితనాన్ని గురించి ఉపన్యాసం ఇచ్చి ఉంటాడు. లేకపోతే తన పెదవులు వంక అలా ఎగతాళిగా చూడడు. శ్యామ సుందర్ కి సిగరెట్ తాగాలని బుద్ధి పుట్టింది చుట్టూ చూశాడు. ప్లాట్ ఫారం చివర చెట్టుకింద మామగారు ఎవరితోనో బాతాఖానీ కొడుతున్నాడు. ఎవరో రిటైర్డు ఆఫీసరయి ఉంటాడు. బహుశా ఆ సంభాషణ రైలు వచ్చేదాకా అంతంకాదు. శ్యామసుందర్ ధైర్యం చేసి, ముఖం కొంచెం చాటుచేసుకొని, ఓ గోల్డు ఫ్లేక్ సిగరెట్ కొని ముట్టించి వెయిటింగ్ రూమ్ లోకి

దారితీశాడు. స్త్రీల వెయిటింగ్ రూమ్ వైపు ఓ సారి దొంగచూపు విసిరాడు. పద్మ తమ్ముడితో ఏదో చెబుతూ నవ్వుతోంది. ఇంకెవరో ఒకరిద్దరు స్త్రీలు వున్నట్టున్నారు. శ్యామసుందర్ చూపులు మరల్చి బుద్ధిమంతుడిలా వెయిటింగ్ రూమ్ లో కుర్చీకి జేరగిలబడి కిటికీలోంచి బయటికి చూస్తూ పొగవదలసాగాడు.

మూడుగంటలకే సముద్రపు గాలి తిరిగి చల్లగా ఉంది. మందమందంగా గాలి వీస్తూ పొగని పిల్లవాడి పిచ్చి గీతల్లా చెదరగొడుతోంది. కిటికీలోంచి తాము పల్లెటూరునించి ఎక్కివచ్చిన ఎడ్లబండి కనిపిస్తోంది. పాలేరు లేడు. చుట్ట కొనుక్కోడానికి ఏ అంగడికో పోయి ఉంటాడు. శ్యామసుందర్ కి ఏదో చెప్పలేని ఉత్సాహంగా ఉంది. ఏవో తియ్యని తలపులు, అందమైన దృశ్యాలు అతణ్ణి ఉత్తేజితుణ్ణి చేస్తున్నాయి. మానస వీధిలో పద్మ రకరకాలు ముఖభంగిమలతో అలరిస్తోంది. గిరిగీసినట్టుగా తలపులన్నీ ఆమె చుట్టూ తిరుగుతున్నాయి. పొగ వలయాకారంగా తిరుగుతుంటే అతని మనసులో చప్పున ఒక దృశ్యం మెదిలింది. పెళ్ళిరోజున పద్మరాగంలా వెలిగిపోయే ఉంగరాన్ని ఆమె వేలికి తను పెడితే, ఆమె బుగ్గలు పద్మరాగాలై సిగ్గుగా, ఇంద్రనీలంలా దేదీప్యమానమైన ఉంగరాన్ని తన వేలికి తొడిగింది.

"సరైనవే ఎన్నుకున్నారు." బంధువులు నవ్వులాటలకి ఎగతాళిగా అన్నారు.

తను చామనచాయ, పద్మ ఎరుపు.

"కొంచెం నలుపైతే ఏం ? మా వాడు ఇంద్రనీలమణి." అంది అమ్మ.

"అవునవును." అని అందరూ నవ్వారు. పద్మ చిరునవ్వు నవ్వినట్టు ఎవరూ తెలుసుకోక పోయినా, ఆ వెన్నెల కిరణం ఎర్రని పెదవుల మీదుగా చెక్కిళ్ళకి సోకిన విషయం తను స్పష్టంగా గమనించి మైమరిచాడు.

మధురభావన మనసుని అలరించగా, రాగ హృదయంతో శ్యామసుందర్ తలవంచి వేలు చూసుకున్నాడు. వెంటనే అతని గుండె గతుక్కుమంది. వేలికి ఉంగరం లేదు. అతనికి ముచ్చెమటలు పోశాయి. ఏమైంది వుంగరం ? నేలంతా కలయచూశాడు, కుర్చీలూ, బల్లలూ వెతికాడు. దుస్తులు దులిపి చూశాడు. ఊఁ హూఁ పోయింది ! ఎక్కడ పడిపోయిందో ! అసలే తను అజాగ్రత్త మనిషి. ఉంగరం కొంచెం వదులుగా వుంది. సరిచేయించాలనుకుంటూనే ఉన్నాడు. వ్యవధి లేకపోయింది. అందుకని ఉంగరం వేలుకి కాకుండా మధ్యవేలుకి పెట్టుకుని గడిపాడు. కానీ పదహారు రోజుల పండగకి వచ్చి, పద్మ తొడిగిన వేలుకే ఉంగరం మార్చాలనిపించి, ఆ పని చేశాడు. భయపడుతూనే ఉన్నాడు. అనుకున్నంతా జరిగింది.

శ్యామసుందర్ వెంటనే కుర్చీలోంచి లేచి సిగరెట్ దూరంగా పారేసి. తను ప్లాట్ ఫారం మీద తిరిగిన స్థలాలన్నీ వెతికాడు. జనం అంతగా లేరు. కాని ఎవరికైనా దొరికితే వదులుకునే పరిస్థితులు కావు. అందరూ అంతేనని కాదు. కాని అలాంటి వాళ్ళకే అది దొరకాలనేముంది ? శ్యామసుందర్ కి ఉన్నట్టుండి ఒక ఆశాభావం కలిగింది. ఒకవేళ బండిలో కూర్చున్నప్పుడు వేలినించి జారి పడిందేమో. అలా అయితే బండీ దిగుతున్నప్పుడు ఎవరికంట పడకుండా ఉంటుందా ? ఏమో ! ఆ గడ్డిలో ఇరుక్కుని ఉండొచ్చు. అతను ఆలస్యం చేయకుండా వెంటనే ఎడ్లబండీ దగ్గిరికి వెళ్ళి ఆ గడ్డి అంతా దులిపి చూశాడు. ఆశ అడియాస అయింది. ఆ నేలంతా వెతుకుతూ తలెత్తి స్టేషన్ వైపు యధాలాపంగా చూశాడు. కిటికీలోంచి ఎవరో తనవైపు చూస్తున్నట్టు కనిపించింది. పరకాయించి చూశాడు. ఎవరు, పద్మేనా ?

శ్యామసుందర్ మనసు చివుక్కుమంది. తను బండీలో ఏదో వెతుకుతున్నట్టు పద్మ కనిపెట్టిందా? ఒక వేళ ఆమె చూసినా తను ఉంగరం వెతుకుతున్నట్టుగా ఆమె ఊహించటానికి అవకాశం లేదు. ఉంగరం వదులుగా ఉందని పద్మతో తను చెప్పలేదు. కాని వేలికి ఉంగరం లేకపోతే అడగదా? ఏం చెప్పాలి ? పోయిందని చెబితే ఆమె చిన్నబుచ్చుకోదా? ఏవేవో కబుర్లు చెప్పాడు. తన సర్వస్వం అనీ, ఆమె తన బ్రతుక్కి దీపం అనీ, తన జీవిత నౌకకి చుక్కాని అనీ ఏమేమిటో అన్నాడు. జీవిత పర్యంతం ఆమె ప్రేమ చిహ్నమైన ఆ అంగుళీయకాన్ని ప్రాణప్రదంగా చూసుకుంటానన్నాడు. అవన్నీ ఒట్టి కబుర్లకింద కొట్టిపారేయటానికి ఇప్పుడు అవకాశం ఏర్పడ్డది. ఆమె అలా అంటుందని కాదు. కాని తన అజాగ్రత్త రుజువు అవుతుంది. అన్నింట్లో తను అంతేనని ఆమె ఎందుకనుకోకూడదు ! మరొకటీ, మరొకటీ అయితే అనుకోవచ్చు.

పెళ్ళినాటి ఉంగరం !

వలపు తలపులు ముప్పిరిగొన్న వేళ, ఎర్రటిగాజుల్ని మధుర మంజులంగా రవళిస్తూ మృదువైన వేళ్ళతో పద్మ తొడిగిన ఉంగరం!

శ్యామసుందర్ ముఖం విషాదగ్రస్తమైంది. ప్రేమ చిహ్నంగా పద్మ ఇచ్చిన వస్తువు పోగొట్టుకున్నాడు. తను ఆమె ప్రేమకి తగడేమో! ఈ ఊహ రాగానే శ్యామసుందర్ కంపించాడు. ఏదో అశుభం ఎవరో పలికినట్టయింది. ఏ కుర్రాడికో అది దొరికి "కొంటారా ?" అన దగ్గిరికి తెస్తే ఎంత బాగుంటుంది ? అతను వెంటనే ప్లాట్ ఫారం మీద ఉన్న ప్రతి వ్యక్తినీ పరకాయించి చూడసాగాడు. కొంతమంది అడుక్కునే వాళ్ళు అక్కడక్కడ తిరుగుతున్నారు. వాళ్ళే ఎప్పుడూ రోడ్డుమీద ఏదో వెతుకుతూ ఉంటారు. వాళ్ళని అడిగితే ! బహుశా వాళ్ళలో ఎవరికో దొరికే ఉంటుంది. కాని భయపడి చెప్పరు ! ప్చ్, ఏం చేసేట్టు ? పోలీసు రిపోర్టు ఇస్తే ! ఈ ఊహ నచ్చింది అతనికి. వెంటనే రైల్వే పోలీస్ స్టేషన్ వైపు నడిచాడు. తలుపు దగ్గిర తటపటాయించాడు. ఎందుకో ఆ ఉంగరం గురించి పోలీసు వాళ్ళకి చెప్పటానికి అతనికి మనస్కరించలేదు.

వెనక్కి తిరిగాడు. ఎదురుగా మామగారు వస్తున్నారు. ట్రెయిన్ వచ్చేదాకా ఆ వ్యక్తితో అక్కడే మాట్లాడతారేమో ననుకున్నాడు. కానీ ఇద్దరూ కలిసి తనవైపే వస్తున్నారు. ఆయనకీ విషయం తెలిస్తే నానా హంగామా చేస్తాడు. ఎలా తప్పించుకోటం ? చప్పున హిగిన్ బాథమ్స్ బుక్ స్టాల్ దగ్గిర ఆగి ఏవో పుస్తకాలు కొన్నాడు శ్యామసుందర్.

"ఇతనేనండీ మా అల్లుడు. వీరు రిటైర్డు తాసిల్దారు రామచంద్రరావుగారోయ్." అన్నారు మామగారు. ఈ పరిచయం తప్పదని శ్యామసుందర్ ముందే కనిపెట్టి, తగు జాగ్రత్తలోనే ఉన్నాడు. పుస్తకాలతో చేతులు కప్పుకుంటూ నమస్కరించాడు.

"సంతోషం బాబూ, ఏవో పుస్తకాలు కొన్నట్టున్నావే ! మన కాలంలో లేదుగాని, ఈ రోజుల్లో కుర్రాళ్ళకి పుస్తకాలమీద మహా మోజండీ," అంటూ ఆ రిటైర్డు తాసిల్దారు గారు శ్యామసుందర్ చేతుల్లోంచి పుస్తకాలు లాక్కోవటం, ఆ అంగుళీయకనిరస్త హస్తాన్ని మామగారు చూడటం జరగనే జరిగాయి.

"అదేమిటోయ్, ఉంగరమేదీ ?"

"వదులైతే తీసి దాచానండీ." అని అబద్ధం చెప్పేశాడు శ్యామసుందర్. ఆ చెప్పటంలో ఒక్క క్షణం తటపటాయించాడు. అబద్ధమెప్పుడూ చెప్పినవాడు కాదు. అతనివంక సందేహంగా చూడనే చూశారు మామగారు.

"వదులైందా, అరె, చెప్పనేలేదే." అన్నారు.

"అవునండీ, బాగుచేయిస్తాను."

"నేను చేయించేవాడిని కదుటోయ్ ఏదీ?"

ముచ్చెమటలు పోశాయి శ్యామసుందర్ కి. ఆపద్భాంధవుడిలా రైలు సమయానికి కూతవేసి ఆదుకుంది.

"ట్రెయిన్ వస్తోందండీ" అని తను చేసే పనేమీ లేకపోయినా, వెయిటింగ్ రూమ్ వైపు, పుస్తకాలకోసమైనా చూడకుండా పరిగెత్తాడు.

అందరూ సెకండ్ క్లాస్ కంపార్ట్ మెంటులో ఒక్క పెట్టెలోనే ఎక్కారు. అందరూ అంటే మరెందరో లేరు. నోటీసు లేకుండా పదహారు రోజుల పండుగ కాగానే కాపరానికి తీసుకువెడతానంటే, ఇంట్లో అవీ ఇవీ సర్దుకోవలసి వచ్చి అత్తగారు రావటం లేదు. వచ్చేవాళ్ళు మరెవరూ లేరు. పదిపదకొండేళ్ళ బావమరిదీ, భార్యా, మామ గారూ, తనూ. సమయానికి రైలు రాబట్టి ఎలాగో తప్పించుకున్నాడు గాని, రైల్లో తీరిగ్గా మామగారు ఈకకి ఈక తీసి విషయం అంతు తేలుస్తాడని భయపడుతూనే ఉన్నాడు శ్యామసుందర్. పద్మ తన వేలువైపు చూడనే చూసింది. ఆమెకి తెలిసిపోయిందా ?

"సుందరం ఉంగరం వదులైందిటమ్మా."

ఆయన పద్మ చూపుల్ని అనుసరించి అన్నాడు.

గబుక్కున ఆమె కళ్ళలోకి చూశాడు శ్యామసుందర్.

ఆమె చూసింది.

ఆ చూపుల్లో ఏముందో ?

ఏముందో అంతుబట్టలేదుగాని, శ్యామసుందర్ గుండె దడదడలాడింది. ఆ చూపుల్లో కోపం లేదు. నిస్పృహ లేదు. ఆమెకి విషయం తెలిసిందో లేదో ? తను ఏదో వెతుకుతున్నట్టు ఆమె కనిపెట్టిన మాట మాత్రం నిజం.

మళ్ళీ ఆమె కళ్ళలోకి చూశాడు. ఈ సారి ఆమె చూపులు గుండెల్లో గుచ్చుకున్నాయి. ఆమె బేలగా చూస్తోంది. తను పెరిగిన పరిసరాలన్నీ వదిలేసి తనతో జీవితం పంచుకోటానికి ఎక్కడికో ఎరగని చోటుకి వస్తోంది. నీటముంచినా, పాలముంచినా తనదే భారమన్నట్టుగా సర్వం తనకర్పించి వేసింది. తన కర్పించానన్నట్టుగా చిహ్న ప్రాయంగా ఉంగరాన్ని తన వేలికి ఉంచింది.

ఆ ఉంగరాన్ని పారేశాడు.

వస్తువులు పోవటం సహజమే! కాని తొలిసారి మెట్టినింటికి వస్తున్న శుభఘడియల్లోనే, ప్రేమ పూర్వకంగా తనిచ్చిన కానుక భర్త పోగొట్టుకొన్నాడని తెలిసి, ఆ అమాయిక హృదయం వ్యక్తావ్యక్తమైన వేదనతో కుమిలిపోతోందా?

అదేనా ఆ జాలిచూపుల అర్థం?

శ్యామ సుందర్ హృదయం ద్రవించింది. తనని పద్మ అపార్థం చేసుకుంటుందనీ, తనని ఒట్టి కబుర్ల రాయుడుగా తోసిపారేస్తుందనీ అనుకున్నాడు, కాని ఆ ఊహ ఇప్పుడతన్ని ఏమీ బాధించటం లేదు. బహుశా పద్మ ఆ విషయం తన దగ్గిర తీసుకురాదు. తనే చెప్తాడు, కాని, కాని.. ఆ సంగతి చెప్పగానే ఆమె హృదయం ముకుళించుకు పోతుంది!

విషయం తెలిసి "అపశకునం" అని అందరూ పైకి అనకపోయినా, అనుకుంటూన్నట్టు తమ చేతలవల్లా, గుసగుసల వల్లా తెలియ చేస్తారు. ఆమె ఎంత బాధ పడుతుందో ! ఆమె తప్పేమీ లేకపోయినా, ఉంగరం పోవటానికి పూర్తి బాధ్యత ఆమెదే అన్నట్టుగా, ఆమె ఏదో నేరం చేసిందన్నట్టుగా, దురదృష్ట వంతురాలని సూటీ పోటీ మాటలతో నిందించటం కూడా జరుగుతుంది. ఇదంతా తన అజాగ్రత్తవల్ల ! "పోతుందేమో, జాగ్రత్తగా దాచావా?" అని మామగారు అన్నమాటలకి ఆలోచనల్లోంచి తేరుకుని "ఆ, పర్సులో వుంది" అన్నాడతను.

"పొద్దున్న చెప్పినా, మార్చి మరొకటి తీసుకునేవాళ్ళం." అన్నాడు మామగారు.

"అబ్బే, అది ఎలా మారుస్తామండీ." అని శ్యామ సుందర్ ఆమె వైపు చూశాడు. ఏదో తృప్తి ఆమె కళ్ళలో మెదిలింది.

"ఏదీ, ఎంత వదులైందో చూద్దాం ?" అన్నాడు ఆయన.

"చూట్టానికేముందండీ.?" అని అప్రయత్నంగా వచ్చిన తనమాటల్లోని నిజానికి విస్తుపోయాడు శ్యామసుందర్. వెంటనే మాట తప్పిస్తూ "బాబూ, కిటికీలోంచి అలా వంగి చూడగూడదు. పడిపోతావు." అని బాబుని మందలించాడు. ఊరికే మందలించి ఊరుకోకుండా అతన్ని సరిగ్గా కూర్చోపెట్టి, కిటికీ అద్దం వేసి బుద్ధి పూర్వకంగా తలపై బెర్తుకి ఢీ కొట్టి "అబ్బా" అన్నాడు.

బస్, మామగారు ఉంగరం ప్రసక్తి మానేశారు.

పద్మకి మాత్రం కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

అది శ్యామ సుందర్ గమనించాడు. అయితే కారణం, తన తలకి దెబ్బ తగలటమో, లేక ఉంగరం పోయిందని రూఢీ కావటమో అతనికి అర్థం కాలేదు.

పద్మ కిటికీలోంచి తలపెట్టి, ఆకాశం వంగి దిక్చక్రం దగ్గిర భూదేవిని దగ్గిరికి తీసుకుంటున్న దృశ్యం చూస్తోంది. అలా ఎంత సేపుందో తెలియదు. "లేమ్మా, స్టేషన్ వచ్చింది." అని తండ్రి అన్న మాటలు విని ఉలిక్కిపడి లేచింది.

ఇల్లు చేరగానే శ్యామ సుందర్ మొట్ట మొదట చేసినపని బజారుకి పరిగెత్తటం. చీకటి పడేదాకా రాలేదు. భోజనాలయాయి. మామగారు ఏమనుకున్నాడోగాని ఉంగరం విషయం ఎవరికీ చెప్పలేదని పసిగట్టాడు.

పదిగంటలప్పుడు, కుడిచెయ్యి వెనక్కి పెట్టుకుని దొంగలాగా గదిలోకి ప్రవేశించాడు శ్యామసుందర్. అప్పటిదాకా ఏదో చదువుకుంటూ కుర్చీలో కూర్చున్న పద్మ అలికిడి విని తలెత్తి చూసి చప్పున లేచి నుంచుని అతని వైఖరి చూసి చిన్నగా నవ్వింది.

"దొంగమాటలు బాగా చెప్తారే !"

"ఇంకా నయం! దొంగతనం కూడా బాగా చేస్తాననలేదు."

"ఏమో చేశారేమో. లేకపోతే అలా చెయ్యి వెనక్కి పెట్టుకోటం ఎందుకు, ఏదీ?" అంటూ పద్మ అతని చెయ్యి లాక్కుని చూసి, నిర్ఘాంతపోయింది. వేలికి ఉంగరం ఉంది.

"ఏం, అలా ఆశ్చర్యపోతున్నావు? ఉంగరం పోయిందనుకున్నావా?"

పద్మకళ్ళలో నీళ్ళు తిరిగాయి. అతని చేతిని కళ్ళకి అద్దుకుంది. చేతికి తడితగిలి అతను ఆశ్చర్యంగా ఆమె వైపు చూస్త దగ్గిరికి తీసుకుని "ఏమిటి పద్మా! కళ్ళనీళ్ళు పెట్టుకోటం ఎందుకు ?" అన్నాడు అర్ధంకాక.

"ఏం లేదండీ, పుస్తకాల్లో ఏమేమిటో చదివాను. కాని ఇంత అదృష్టవంతురాల్ని అవుతాననుకోలేదు." గాద్గదికంగా అంటూ, అతని జుట్టులోకి చేతులు పోనిచ్చి.

"బాగా దెబ్బ తగిలిందా?" అంది. లేదన్నట్టుగా తలతిప్పి ఆమె ఆవేదనకి సరైన కారణం తెలియక పోయినా, తెలుసుకోటానికింకేమీ ప్రయత్నం చేయకుండా మరింత దగ్గరికి తీసుకున్నాడు.

తెల్లారి నిద్రలేచేసరికి టూత్ బ్రష్ తో బాబు ప్రత్యక్షమయ్యాడు. "థాంక్స్, వెరీ గుడ్ బాయ్!" అంటూ బ్రష్ అందుకుంటుంటే, "అదేమిటి బావా, ఒకటికి రెండు ఉంగరాలొచ్చాయే, షావుకారల్లే ఉన్నావు" అన్నాడు బాబు నవ్వుతూ.

చేతివేళ్ళు చూసుకుని అదిరి పడ్డాడు శ్యామసుందర్. రెండు వేళ్ళకీ ఒకే రకమైన ఉంగరాలు రెండున్నాయి. అర్థం కాక అప్రయత్నంగా గదివైపు చూశాడు. పద్మ చీరచెంగు నోటికి అడ్డం పెట్టుకొని చప్పున తల పక్కకి తిప్పుకుంది.

★★★

COMMENTS